సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



వరద వస్తే ముప్పే

వరద ప్రవాహం ముందు ఏదైనా చిత్తు కావాల్సిందే. ఎలాంటి కట్టమైనా చిగురుటాకులా వణికిపోవాల్సిందే. 8లో ▸



తల్లిపాలు జీవామృతం

బిడ్డ పుట్టగానే గంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టాలని సీడీపీఓ కాంతారావు తల్లులకు సూచించారు. 8లో ▸



భవితకు 'తొలిమెట్టు'

విద్యార్థుల బంగారు భవితకు 'తొలిమెట్టు' ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా రిసోర్స్ పర్సన్ మురహరి అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

6న ముద్దాయిపేటలో ఉచిత వైద్య శిబిరం

యాలాల: మండల పరిధిలోని ముద్దాయిపేటలో గీత సత్సంగ్ సమితి సౌజన్యంతో ఈనెల 6న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు ఆకుల కృష్ణయ్య, దేవగారి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని శివాలయ ధర్మశాలలో శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమీప తండాలు, గ్రామాల ప్రజలకు సూచించారు.

తాండూరు రైల్వేస్టేషన్‌కు మహర్దశ

అమృత్ భారత్ కింద స్టేషన్ అభివృద్ధికి రూ. 24,04కోట్లు మంజూరు

తాండూరు: అమృత్ భారత్ కింద తాండూరు రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 24,04కోట్లు మంజూరు చేసింది. ఈ నెల 6న ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భారతేష్ కుమార్ జైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పన, స్టేషన్ ప్రాంగణంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు.

పరిగి ఆస్పత్రి స్థాయి పెంపు

పరిగి: పట్టణంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆస్పత్రి స్థాయికి పెంచుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ గురువారం జీవో విడుదల చేసింది. ఆస్పత్రి స్థాయి పెంచడంతోపాటు పరికరాలు, సదుపాయల కల్పనకు రూ. 26 కోట్లు మంజూరు చేసింది. త్వరలో నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రి స్థాయి పెంపుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు అనిల్



చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు పీ అనీల్ డిమాండ్ చేశారు. గురువారం మండల వనరుల కేంద్రం వద్ద ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల కమిటీ సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసింది. ప్రభుత్వం సానుకూల ప్రకటన చేసే దాకా తమ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. ఆగస్టు 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు ప్రమోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం సీపీఎస్‌ఈయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి, కోశాధికారిగా బందెప్పను ఎన్నుకున్నారు.

'వర్గీకరణ' పోరాటం ఆగదు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- తాండూరులో విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ

తాండూరు: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరా టం ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. పట్టణంలోని తులసీ గార్డెన్‌లో గురువారం పార్టీ నాయకులు, సభ్యులతో విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే మాదిగలు, ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈసారి కేంద్ర ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.





కొడంగల్ రూరల్: అప్పాయిపల్లిలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

అన్నదాత ఆనందం

రైతు రుణమాఫీ చేసినందుకు మంత్రి సబితారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, కాలె యాదయ్య తదితరులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా సీఎం కేసీఆర్ చిత్రపాటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇది రైతు ప్రభుత్వమని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'నకి'లీలలు



ఇటీవల వికారాబాద్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలు

యథేచ్ఛగా నకిలీ విత్తనాల విక్రయాలు

- వానాకాలం సీజన్‌లో సేకరించాల్సిన శాంపిల్స్ 410
- అధికారులు తీసుకున్న శాంపిల్స్ 344
- ఇప్పటి వరకు 50శాతం ఫలితాల వెల్లడి
- అందులో 17 రకాల విత్తనాలు నకిలీవే..
- అయినా చర్యలు శూన్యం

వికారాబాద్: ఎరువులు, విత్తన దుకాణాల్లో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఓ వైపు అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తూ రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరో వైపు అనుమతులు లేని, నకిలీ విత్తనాలు విక్రయించి పంట దిగుబడిపై దెబ్బ కొడుతున్నారు. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ శాఖ 410 రకాల విత్తన శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపాల్సి ఉంది. అయితే అధికారులు 344 శాంపిల్స్ సేకరించారు. వాటి ఫలితాలు ఒక్కొక్కటిగా వస్తున్నాయి. ఇప్పటి వరకు 50శాతం ఫలితాలు రాగా అందులో 17 రకాల విత్తనాలు నకిలీవని తేలింది. మరో 50శాతం శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. అయితే నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని తేలినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం స్టాప్ సెల్‌తో సరిపెట్టారు. అయితే చర్యలు తీసుకునే విషయంలో పోలీసు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశామని చెబుతుండగా, ఎక్కడా వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేసిన పాపాన పోలేదు. ఇటీవల జరిగిన జెడ్పీ జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు నకిలీ విత్తనాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అధికారుల తీరునూ ఎండగట్టారు. ఈ విషయంలో సీరియస్‌గా స్పందించిన మంత్రి సబితారెడ్డి సంబంధింత దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

శాఖల మధ్య సమన్వయలోపం

నకిలీ విత్తనాలను అరికట్టే బాధ్యతలను ప్రభుత్వం వ్యవసాయ, పోలీసు శాఖలకు అప్పగించింది. నకిలీ విత్తనాలు విక్రయించే దుకాణ లైసెన్సును రద్దు చేసే అధికారం వ్యవసాయ శాఖకు ఉంటుంది. పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ ఒకటి కంటే ఎక్కువ సార్లు పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేయాలి. అయితే కొడంగల్ ప్రాంతంలో ఒకే వ్యక్తి మూడు సార్లు క్వింటాళ్ల కొద్ది నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడ్డాడు. ఇప్పటి వరకు చర్యలు లేవు. ఇదే విషయమై జెడ్పీ జనరల్ బాడీ సమావేశంలో తీవ్ర దుమారమే రేపింది. మార్కెటింగ్ అనుమతులు లేని సుమారు 20రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మెజారిటీ ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఇదే తంతు సాగుతున్నట్లు సమాచారం. అయితే అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా కేవలం స్టాప్ సెల్‌తో సరిపెడుతున్నారు.

అంతా కుమ్మక్కే

విత్తన దుకాణాదారులు అనుమతులు లేని,నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజన్ ప్రారంభ సమయంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించినా అందులో చిత్తశుద్ధి కనిపించడం లేదు. తనిఖీల్లో పాల్గొనే పోలీసులకు నకిలీ విత్తనాలను గుర్తించే నైపుణ్యం లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులపై ఆధారపడాల్సి వస్తోంది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు స్థానిక డీలర్లు,ఫెర్టిలైజర్ దుకాణ యజమానులతో కుమ్మక్కు కావడంతో అక్రమాలు బయటకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలపై వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత దుకాణాల కుముందుస్తు సమాచారం ఇస్తున్నారని కలెక్టర్, మంత్రికి ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే.

రాజకీయ నిశ్శబ్దం!

- పక్షం రోజులుగా కనిపించని రాజకీయ సందడి
- ప్రధాన పార్టీల నేతలంతా నగరంలోనే మకాం
- ద్వితీయ శ్రేణి నాయకులు ఇళ్లకే పరిమితం



తాండూరు: నియోజకవర్గంలో పక్షం రోజులుగా రాజకీయ నిశ్శబ్దం నెలకొంది. ఎక్కడా నేతల హడావుడి కనిపించడం లేదు. అంతకుముందు అభివృద్ధి, ప్రారంభోత్సవాలు, సమావేశాలతో పోటీపడిన నాయకులు ఉన్నట్టుండి సైలెంటైపోయారు. వరుస వర్షాల నేపథ్యంలో నగరంలో మకాం వేశారు. జిల్లాలోనే తాండూరు రాజకీయాలపై అందరి దృష్టి ఉంటుంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తనదైన శైలిలో రాజకీయాలు చేస్తూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం అభివృద్ధి మంత్రంతో పాటు పీఎంఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతున్నారు. వీరిద్దరూ అధికార పార్టీకి చెందిన వారే కావడంతో వీరి మధ్య ఆధిపత్య పోరు జోరుగా సాగుతోంది. ఒకరిపై ఒకరు పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. పదిహేను రోజుల క్రితం వరకు వీరు తాండూరులో పర్యటించి అభివృద్ధి, సంక్షేమం పేరిట సందడి చేశారు. ప్రస్తుతం పనులన్నీ వాయిదా వేసుకుని నగరంలో ఉంటున్నారు. అయితే ఒక్కసారిగా నేతల పర్యటన ఆగిపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు. బీఆర్ఎస్ టికెట్ తమ నేతకే వస్తుందంటూ పరస్పరం పోస్టులు పెడుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీదీ అదే బాట

నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సైతం బలంగా ఉన్నాయి. ఉన్నట్టుండి వీరు కూడా పార్టీ, ప్రజా కార్యక్రమాలను ఆపేశారు. కాంగ్రెస్‌కు చెందిన రమేష్ మహరాజ్ తాండూరు నియోజకవర్గంలో పర్యటించడం లేదు. బీజేపీ నేతలు సైతం అదే బాటలో ఉన్నారు. నిత్యం ఏదో ఒక సమావేశం, పర్యటనలతో సందడిగా కనిపించే ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు కూడా ఇళ్లకే పరిమితం అయ్యారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల పరిశీలన

- మన్‌సాన్‌పల్లిలో కేంద్ర బృందం పర్యటన
- మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్వహణపై ఆరా

పెద్దేముల్: మరుగుదొడ్లు నిర్మించుకున్న ప్రతిఒక్కరూ తప్పకుండా వినియోగించాలని కేంద్ర బృందం సభ్యులు వినిత్, చైని, అరుణ్ సూచించారు. మండల పరిధిలోని మారేపల్లి, మన్‌సాన్‌పల్లి, మారేపల్లితండాల్లో గురువారం వారు పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల పనులను పరిశీలించారు. వీటి నిర్వహణ, ప్రస్తుత పరిస్థితిపై ప్రత్యేక యాప్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలకు ఎంత చెల్లించారని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) తరుణ్‌కుమార్, డీఆర్‌డీఓ కృష్ణ, డీపీఓ శంకర్‌నాయక్, ఎంపీడీఓ లక్ష్మప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మర్పల్లి కస్తూర్బాలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్ఓ పల్వాన్‌కుమార్

- కస్తూర్బా సిబ్బందికి డీఎంహెచ్ఓ సూచన
- మర్పల్లి గురుకులంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ


మర్పల్లి: గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వాన్‌కుమార్ సూచించారు. జాతీయ పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కళ్ల కలకపై ఆందోళన అక్కర్లేదని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతోనే విద్యార్థులకు కళ్ల కలక వస్తోందన్నారు. కంటి దురద, కళ్లు ఎర్రబడటం వంటి ఇబ్బందులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఐ ఫ్లూ బారిన పడిన వారు ఇతరులకు కొంత దూరం పాటించాలని సూచించారు. ఈ వ్యాధికి సంబంధించిన అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓ ఎఫ్‌పీ డాక్టర్ పవిత్ర, పట్లూర్ మెడికల్ అధికారి నేహా పాఠశాల ప్రత్యేకాధికారి, ఏఎన్ఎం ఆశవర్కర్లు ఉన్నారు.

అల్బెండజోల్ మాత్రలపై సందేహాలు వద్దు

పెద్దేముల్: చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు వేసే అల్బెండజోల్ మాత్రలపై ఎలాంటి సందేహాలు వద్దని డీఎంహెచ్ఓ డాక్టర్ పాల్వాన్‌కుమార్ సూచించారు. గురువారం పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు విధిగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్ యాదవ్, జీవరాజ్, పెద్దేముల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు, పీహెచ్ఎన్ అరుణకుమారి, ఏఎన్ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

కండువా మారింది

- కాంగ్రెస్ గూటికి గురునాథ్‌రెడ్డి
- ఏఐసీసీ, పీసీసీ అధ్యక్షుల సమక్షంలో హస్తం పార్టీలో చేరిక



గురునాథ్‌రెడ్డికి కండువా కప్పుతున్న ఖర్గే

కొడంగల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కొడంగల్ నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా పేరుగాంచిన ఆర్.గురునాథ్‌రెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు మద్దూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణరెడ్డి, కోస్గి మండల సీనియర్ నాయకుడు కిష్టప్ప, బొంరాస్‌పేట మండల సీనియర్ నాయకుడు సీసీ వెంకటయ్య తదితరులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆధ్వర్యంలో హస్తం పార్టీలో చేరారు. జాతీయ అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాజకీయ ప్రస్తానం..

కొడంగల్ నియోజకవర్గం నుంచి గురునాథ్‌రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి పాలమూరులో రికార్డు సాధించారు. 1978లో స్వతంత్ర అభ్యర్థిగా, 1983, 1989, 1999, 2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు.2018 ఎన్నికల్లో తన సీటును త్యాగం చేసి టీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. టీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని అసంతృప్తిగా ఉన్నారు.దీంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ లేదా రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ ఇస్తారని భావించినా నిరాశే ఎదురుకావడంతో పార్టీ మారేందుకు నిర్ణయించుకున్నారు.పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆహ్వానం మేరకు తిరిగి కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు.

జంగమ సమాజ అభ్యున్నతికి పాటుపడుతా



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: జంగమ సమాజ అభ్యున్నతికి పాటుపడుతానని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. పట్టణంలో ఇటీవల ఎన్నికైన జంగమ సమాజ నూతన కార్యవర్గాన్ని గురువారం భావిగి భద్రేశ్వరాలయంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజ గౌరవ అధ్యక్షుడు నీలకంఠస్వామి, అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి మఠం నిరంజన్ స్వామి, కార్యవర్గ సభ్యులు పరమేశ్వర్, బసప్ప, సంతోష్, చందుతో పాటు శుభప్రద్ పటేల్ యువసేన సభ్యులు భానుప్రసాద్, బాలు, విజయ్, హరీష్, శ్రీశైలం, సచిన్, నరేష్, చందు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించినట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో 2023–25 సంవత్సరాలకు గాను ఎస్టీ, ఎస్సీ, గౌడ సామాజికవర్గాలకు లాటరీ ద్వారా షాపులను కేటాయించారు. జిల్లాలోని 59 మద్యం దుకాణాల్లో ఎస్టీలకు రెండు, ఎస్సీలకు 9, గౌడ కులస్తులకు ఆరు షాపులు కేటాయించారు. మిగిలిన 42 మద్యం షాపులను జనరల్ కేటగిరి కింద ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ అధికారి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

క్లుప్తంగా

ఓటేయడం పౌరుల బాధ్యత


అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొడంగల్: మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం ద్వారానే ఓటింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఓటు వేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని స్పష్టంచేశారు.

కోమా నుంచి మృత్యు ఒడికి


నరేందర్(ఫైల్)

బొంరాస్‌పేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రాజస్థాన్‌కు చెందిన యువకుడు నరేందర్ (22) గురువారం మృతిచెందాడు. కుటుంబంతో కలిసి బొంరాస్‌పేటలో నివాసం ఉంటున్న నరేందర్ గత నెల 30న ద్విచక్ర వాహనంపై వెళ్తూ తుంకిమెట్ల వంతెన వద్ద ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటి నుంచి కోమాలో ఉన్నాడు. పరిస్థితి పూర్తిగా విషమించడంతో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక

- పురుగు మందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి


శేఖర్(ఫైల్)

కొడంగల్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని హస్నాబాద్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూర్పు శేఖర్(27) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక గత మంగళవారం పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని హైదరాబాద్‌లోని దక్కన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య తూర్పు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాలకిషన్ తెలిపారు.

మహిళపై అసభ్యకర ప్రవర్తన.. కేసు నమోదు

యాచారం: ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై యాచారం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని నల్లవెల్లికి చెందిన పేరుమళ్ల సామెల్ బుధవారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన ఓ ఇంట్లోకి ప్రవేశించి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు 100కు ఫోను చేసి ఫిర్యాదు చేసింది. దీంతో వివరాలు సేకరించి సామెల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సైదయ్య తెలిపారు.

'తొలిమెట్టు'పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కడ్తాల్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో తెలుగు భాషా, గణిత సామర్థ్యాల సాధనపై, గత రెండు రోజులుగా శిక్షణ తరగతులు నిర్వహించారు. కోర్స్ డైరెక్టర్, నోడల్ అధికారి జంగయ్య ఆధ్వర్యంలో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అరుణ, విజయ పర్యవేక్షణలో, రిసోర్స్‌పర్సన్స్ మల్లయ్యగౌడ్, సుశీల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. 1నుంచి ఐదో తరగతి వరకు బోధనా విధానాలను వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు, CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మరోసారి వరద వస్తే ముప్పే

- మూణ్నాళ్లకే రూ.50లక్షలు నీటిపాలు
- వరద ఉధృతికి దెబ్బతిన్న తాత్కాలిక వంతెన


నాగసమందర్ వైపు వరద నీటికి సీసీబెడ్ లేచిపోయి ధ్వంసమైన వంతెన

ధారూరు: వరద ప్రవాహం ముందు ఏదైనా చిత్తు కావాల్సిందే. ఎలాంటి కట్టమైనా చిగురుటాకులా వణికిపోవాల్సిందే. అందుకు ఇటీవల జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. రహదారులు, ఇళ్లు, భారీ వంతెనలు, విద్యుత్ స్తంభాలు ఇలా ఎన్నో కొట్టుకుపోయాయి. కూలి పోయాయి, పోతూనే ఉన్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ ఇది. నిన్నమొన్నటి వరకు కురిసిన వర్షాలకు కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు ఉధృతంగా ప్రవహిస్తూ.. గత ఏడాది రూ. 50 లక్షలతో కొత్తగా నిర్మించిన తాత్కాలిక వంతెనను దెబ్బతీసింది.

ప్రస్తుతం ముప్పుతప్పినా..

ధారూరు మండలం నాగసమందర్–రుద్రారం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గతేడాది రూ.50 లక్షలతో నిర్మించిన తాత్కాతిక వంతెన జూలై 25న ప్రవహించిన వరద నీటికి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వరద ఉధృతి తగ్గడంతో దుస్థితి బయటపడింది. కోట్‌పల్లి జలాశయం అలుగునీటి ఉధృతికి ఈ వంతెనపై ఓ చోట రుద్రారం వైపు సీసీబెడ్ లేచిపోయింది. వంతెన ప్రారంభ సమయంలో వేసిన శిలాఫలకం వరద పాలైంది. నాగసమందర్ వైపు సీసీబెడ్ నీటిలో కొట్టుపోయి ముక్కలైంది. కొత్తగా వేసిన సీసీబెడ్ రోడ్డు కింది భాగంలో సిమెంట్, మట్టి కొట్టుకుపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. వంతెనపై మధ్యంలో పగుళ్లు ఏర్పడ్డాయి. వంతెనపై కొన్ని దిమ్మెలు విరిగి, కొట్టుకుపోయాయి. 2016లో అలుగు ఉధృతికి పాత వంతెన కొట్టుకుపోగా.. 2017లో రూ.4 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో తాత్కాలిక వంతెనను నిర్మించారు. అలుగు వరదలో రోజుకు 50వేల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లిపోయి.. కాగ్నానదిలో కలిసిపోతోంది. ప్రస్తుతానికి వంతెనకు కొంత మేర ముప్పు తప్పినా.. మరోసారి వరద వస్తే ముప్పుతప్పదనే సంకేతాలు వెలువెడ్డాయి.

18 మందికి రెండో విడత గొర్రెల పంపిణీ

యాలాల: మండలంలోని పలువురు గొల్ల, కురుమలకు గురువారం రెండో విడత గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జంటుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్త చేతులమీదుగా లబ్ధిదారులకు జీవాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో మొదటి విడత కింద 688 సభ్యులకు గొర్రెలు పంపిణీ చేశామని, రెండో విడతలో 691 మంది సభ్యులలో 580 మంది రైతులు తమ వాటా డీడీలు చెల్లించారని తెలిపారు. వీరిలో జుంటుపల్లికి చెందిన 13 మంది, చెన్నారానికి చెందిన ఇద్దరు, కోకట్- ఇద్దరు, అచ్యుతాపూర్‌కు చెందిన మరో వ్యక్తికి మొత్తం 18 మందికి రెండో విడత కింద జీవాలు అందజేశామని స్పష్టంచేశారు. వీరికి 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున ఇచ్చామన్నారు. విడతల వారీగా అందరికీ గొర్రెలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ స్వరూపరాణివెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్ తదితరులు ఉన్నారు.


జుంటుపల్లిలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, పశువైద్యుడు

కాగ్నా కష్టాలు తీరాయి!


డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

- డైవర్షన్‌ను రోడ్డుకు మరమ్మతు పనులు ముమ్మరం
- నేటి నుంచి రాకపోకలు పునఃప్రారంభం: ఆర్‌అండ్‌బీ ఏఈ

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'కాగ్నా కష్టాలు తీరేదెప్పుడో' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. ధూరూరు మండల పరిధి స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై నిర్మిస్తున్న అసంపూర్తి వంతెన పక్కనే నిర్మించిన డైవర్షన్ రోడ్డు నది ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గాన రాకపోకలు స్తంభించాయి. గురువారం జేసీబీ సహాయంతో డైవర్షన్ రోడ్డును బాగుచేయించే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. రెండు వైపులా దెబ్బతిన్న రోడ్డులో రాళ్లు వేసి, దానిపై మట్టిపోసే పనులు ముమ్మరం చేశారు. డైవర్షన్ రోడ్డులో వేసిన సీసీ పైపుల మధ్య రాళ్లు వేసి, పైన మట్టి పోయిస్తుండగా.. మరమ్మతు పనులను తాండూర్ ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడారు. శుక్రవారం నుంచి డైవర్షన్ రోడ్డుపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పారు. ప్రస్తుతం బాగుచేసిన రోడ్డు చదును పనులు కొనసాగుతున్నాయని, మళ్లీ వర్షాలు పడి సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టుల్లోకి నీరు అలుగు ద్వారా ఉధృతంగా ప్రవహిస్తే అవి కాగ్నా నదిలో కలుస్తాయని పేర్కొన్నారు. డైవర్షన్ రోడ్డుపై వరద ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయని వెల్లడించారు. రాకపోకలకు శాశ్వత పరిష్కారం ఈ వంతెనను పూర్తి చేయడమేనని ఆయన వివరించారు.

రూ.లక్షకు తప్పని నిరీక్షణ

- లబ్ధిదారుల ఎదురుచూపు
- జాబితా తమవద్ద లేదంటూ అధికారుల దోబూచులాట


తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న కులవృత్తి దారులు (ఫైల్)

దౌల్తాబాద్: బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ నెల 15 నుంచే ఎంపిక చేసిన లబ్ధిదారులకు సాయం అందించాలని తొలుత నిర్ణయించినా.. మండలంలో ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో ఆశతో ఉన్న దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు. జులై 25లోగా ఆర్థిక సాయం అందించాలని ఆదేవాలు ఉన్నప్పటికీ ఆలస్యం అవుతుండడంతో ఆశావహుల్లో సవాలక్ష అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరికి ఇచ్చారు..

మండలంలో మొత్తం 600మంది దరఖాస్తు చేసుకున్నారు. గత నెల 15వ తేదీ వరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు.. దరఖాస్తులను పరిశీలించి 460మంది అర్హులుగా గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక పంపారు. అయితే మొదటి రోజు పంపిణీ కార్యక్రమం ఉన్నందున ఇద్దరికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. మొదటి విడతలో 30 మందిని ఎంపిక చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వారి ఆదేశాల మేరకు ఎంపిక చేసి, అర్హుల జాబితా కలెక్టర్ కార్యాలయానికి పంపామని అధికారులు చెబుతున్నా.. ఇప్పటి వరకు అతీగతీ లేదని పలువురు విమర్శిస్తున్నారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉండడంతో జాబితాలో స్థానం లభిస్తుందో లేదోనన్న బెంగ దరఖాస్తుదారులను వెంటాడుతోంది. ఎలాంటి రాజకీయ పలుకుబడి లేని అర్జీ దారులు మండల పరిషత్తు కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. జాబితా కోసం వాకబు చేస్తున్నారు. ఈ ఒత్తిళ్లను తప్పించుకునేందుకు అధికారులు ఎంపిక ప్రక్రియ తమ వద్ద జరగడంలేదని, అంతా జిల్లా స్థాయిలోనే పూర్తవుతుందని చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ తిరుమలస్వామిని వివరణ కోరగా.. అర్హుల జాబితాను కలెక్టర్ కార్యాలయానికి పంపాము. అక్కడి నుంచి ఏ ఆదేశాలు వస్తే.. వాటిన అమలు చేస్తాం. ఇప్పటి వరకైతే తమ వద్ద వరకు జాబితా తమ వద్దలేదంటున్నారు.

ఆటో బోల్తా

పలువురికి గాయాలు


చలివేంద్రంపల్లి వద్ద బోల్తాపడిన ఆటో

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఆటో బోల్తాపడ్డ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..చలివేంద్రంపల్లి నుంచి ఎదిర గ్రామంలో వరినాట్లు వేయడానికి వెళుతున్న మహిళా కూలీల ఆటో గురువారం బోల్తాపడింది. ఆటోలో 16 మంది ప్రయాణిస్తుండగా 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన మహిళలను కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ సక్రమ్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


చంద్రకళ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా వీవీఎల్ చంద్రకళ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన ఆమె గురువారం చార్జ్ తీసుకున్నారు.

టికెట్ మనకే.. గెలిచేది మనమే..

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి


ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో మల్కాపూర్ నాయకులు

తాండూరు రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశం ఇస్తారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన నాయకులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ నివాసంలో ఆయన్ను కలిసారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులపై నాయకులతో మహేందర్ రెడ్డి చర్చించారు. ఈనెల 15వ తేదీలోపు టికెట్ వస్తుందని, తాండూరులో గెలిచేది కూడా మనమే అంటూ నాయకులకు భరోసా కల్పించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో గని కార్మిక సంఘం మాజీ వైస్ చైర్మన్ పండరి, ఉప సర్పంచ్ అబ్దుల్ మాజిద్, నాయకులు పండరిచారి, ఘనాపూర్ మైనొద్దీన్ ఉన్నారు.

సీసీరోడ్ల నాణ్యతపై విచారణ

- డ్రైనేజీ నిర్మాణంలో బయటపడ్డ డొల్లతనం
- ఉన్నతాధికారులుకు నివేదిస్తాం: పంచాయతీరాజ్ ఏఈ


సీసీరోడ్డు నాణ్యతను పరీక్షిస్తున్న ఏఈ

యాలాల: కమాల్‌పూర్ గ్రామంలో ఇటీవల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల నాణ్యతపై పంచాయతీరాజ్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఆ నిర్మాణాల్లో నాసిరకమైన పనులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి ఇటీవల రూ.36లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు.. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించగా.. వాటిల్లో నాసిరకమైన పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఏఈ సంతోష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి పూర్తయిన సీసీ, సైడ్ డ్రైనేజీలన పరిశీలించారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో వాటి నాణ్యతను పరీక్షించారు. కాగా సైడ్ డ్రైనేజీ బెడ్‌ల నాణ్యత పూర్తి స్థాయిలో పాటించలేదని, సీసీలో సైతం నాణ్యతా ప్రమాణాలను పాటించలేదని గుర్తించారు. డ్రైనేజీ బెడ్ 75 మి.మీ.లు ఉండాల్సిన చోటా కేవలం 50 మి.మీ.ల సిమెంటు బెడ్డు వేసినట్లు గుర్తించారు. తాము వెల్లడించిన విషయాన్ని ఉన్నతాధికారులుకు నివేదిస్తామని, అప్పటి వరకు ఈ నిర్మాణాల ఎం.బీలు రికార్డు చేయమని ఏఈ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులను చేపట్టడంతో తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని స్థానికులు పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. రైతు రుణ మాఫీపై ప్రకటన చేయడంతో గురువారం షాద్‌నగర్ పీఏసీఎస్ వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైఖ్య పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వం చేపడుతున్న విధానాలతో వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో చాలా మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారి సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. రైతులను రాజుగా మార్చేందుకు ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా, నిరంతర విద్యుత్ సరఫరా, ఎరువులు, విత్తనాల పంపిణీ చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రుణ మాఫీ హామీని అమలు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగించమని చెప్పినా సీఎం అంగీకరించలేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, వైస్ చైర్మన్ చల్లా పాండురంగారెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు జీవామృతం

తల్లిపాల వారోత్సవాల్లో సీడీపీఓ కాంతారావు, తదితర అధికారులు


మర్పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు


మోమిన్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత

మర్పల్లి: బిడ్డ పుట్టగానే తల్లి తప్పనిసరిగా గంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టాలని సీడీపీఓ కాంతారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూమీడియం పాఠశాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర బాలికలు, మహిళా ఉద్యోగులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. తల్లి పాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని, బిడ్డకు ఇచ్చే తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయని తెలిపారు. ప్రతి తల్లి తమ బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలే పట్టించాలన్నారు. ఆ తరువాత సులవుగా జీర్ణమయ్యే అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. కొంతమంది మహిళలు తల్లిపాలు పట్టడం లేదని, దీంతో ఆ పిల్లల ఎదుగుదల లోపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానబేగం, ఉర్దూమీడియం పాఠశాల మహిళ టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

గంటలోపు..

పూడూరు: పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపే తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాల వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పుట్టిన రెండుమూడు రోజుల్లో తల్లిపాలు పడలేవని తేనె, గ్లూకోజు, పంచధార నీరు ఇవ్వడం చేయరాదని సూచించారు.

పోషకాలు పుష్కలం..

బంట్వారం: పసి బిడ్డకు తల్లి పాలే తాగించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి అన్నారు. కోట్‌పల్లి మండలం ఎన్నారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు తాగించడంతో శిశువుకు సరైన పోషకాలు అందుతాయని, తల్లికి ఎంతగానో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దశరత్‌గౌడ్, హెచ్‌ఎం జ్యోతి, ఎఎన్‌ఎం హేమలత, అంగన్ వాడీ టీచర్లు భాగ్యమ్మ, లక్ష్మి ఉన్నారు.

దోమలో..

దోమ: తల్లిపాలే శిశువుకు శ్రేయస్కరమని అంగన్వాడీ సూపర్‌వైజర్ ఇందిర అన్నారు. దోమ మండలం పాలేపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ యశోద, పంచాయతీ కార్యదర్శి సంతోషి, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్లు, గర్భిణులు ఉన్నారు.

శ్రీరామరక్ష

మోమిన్‌పేట: ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రు పాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. మోమిన్‌పేట మండలం ఏన్కతలలో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. బిడ్డకు ముర్రు పాలే శ్రీరామరక్ష అని, తల్లి పాలు ఇవ్వడం వలన తల్లీ బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఓ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం మంజుల తదితరులు ఉన్నారు.

అత్తగారింటికి వెళ్తూ..

- బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి
- బుల్కాపురంలో ఘటన


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమార్

శంకర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుల్కాపురం గ్రామ శివారు వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ పంచాయతీకి చెందిన ఉప్పరి కుమార్(37) బైక్‌పై అత్తగారి ఊరైన శంకర్‌పల్లి మండలం మోకిలకు వెళ్తుండగా.. బుల్కాపురం శివారులో ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణం వదిలాడు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై స్పష్టత రాలేదు. విషయం తెలుసుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమార్‌కు భార్య కృష్ణవేణి, కుమారుడు రిత్విక్, కుమార్తె శివ స్పందన ఉన్నారు. కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ రెడ్డి తెలిపారు.